క్లుప్తంగా

బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయం

చివ్వెంల : బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గాయంవారిగూడెం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ధరావతు వీరన్న నాయక్, మాజీ జెడ్పీటీసీ చింతమళ్ల రమేష్, జెర్రిపోతుల క్రిష్ణయ్య, కలకోట్ల సంజీవ, ధరావతు భీక్యా, సైదులు, రాములు, శేఖర్, వరప్రసాద్, మోహన్, సాయిక్రిష్ణ, మల్సూర్, సతీష్, రవి, శంకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నివాళులర్పిస్తున్న వైస్ ఎంపీపీ మణిమాల

నాగారం : నాగారం మండల కేంద్రానికి చెందిన చిప్పలపల్లి రాజు(40) రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆదివారం మృతి చెందాడు. ఈ సందర్భంగా మృతుడి భౌతికకాయాన్ని స్థానిక వైస్‌ఎంపీపీ గుంటకండ్ల మణిమాల సందర్శించి, మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గుండగాని అంబయ్యగౌడ్, కూరం వెంకన్న, కన్నెబోయిన భద్రయ్య, చిప్పపల్లి మల్లేష్, ఎల్క సైదులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



హుజూర్‌నగర్ : పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ మున్సిపల్ కౌన్సిలర్ జక్కుల వీరయ్య ఆధ్వర్యంలో 23వ వార్డుకు చెందిన పలు కుటుంబాల వారు ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు వారికి మూడు రంగుల కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్, మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన రవి, మాజీ చైర్మన్ జక్కుల వెంకయ్య, జక్కుల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి నివాళి

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని మాలిపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు కేశిడి దేవిరెడ్డి ఇటీవల మృతి చెందారు. దీంతో అతడి చిత్రపటానికి ఆదివారం తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, డీసీసీబీ మాజీ చైర్మన్ సోమిరెడ్డి, పాలకుర్తి రాజయ్య, కేశిడి రవీందర్ రెడ్డి, బత్తుల శ్రీను, సుంకరి జనార్దన్, రజనీకాంత్, కందుకూరి లక్ష్మయ్య, శాగంటి రాములు, సాయి తదితరులు ఉన్నారు.

ఇద్దరిపై కేసు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా పోస్టు పెట్టిన విషయమై ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణ పోలీస్ స్టేషన్‌కు చేరింది. దీంతో ఇద్దరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చింతలపాలెం మండలంలోని రేబల్లె గ్రామానికి చెందిన నాగరాజు అదే గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డిపై సోషల్ మీడియాలో ఒక పోస్టుపెట్టాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అది కాస్తా ముదిరి ఒకరిపై మరొకరు చేయి చేసుకునే వరకు వెళ్లింది. ఇద్దరు చెరొక పార్టీకి చెందిన వారు కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపారు.

న్యూడెమోక్రసీ నాయకుడికి నివాళి

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు నల్లగుంట్ల ఉప్పలయ్య మృతిచెందారు. దీంతో అతడి మృతదేహానికి ఆదివారం పలువురు నాయకులు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, సూర్యాపేట జెడ్పీటీసీ జీడి భిక్షం, సీపీయూ చామకూరి నర్సయ్య, తదితరులు ఉన్నారు.

నేడే పోలింగ్.. ఏర్పాట్లు పూర్తి



కోదాడ : విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎన్నికల సిబ్బంది



పంపిణీ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్,ఎస్పీ

- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఈవీఎంలు, ఎన్నికల సిబ్బంది
- కోదాడలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

కోదాడరూరల్ : ఓట్ల పండుగకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు అధికారయంత్రాంగం సిద్ధమైంది. కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో గల ఎఫ్‌సీఐ గోదాములో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రం వద్దకు ఆదివారం ఎన్నికలో పాల్గొనే సిబ్బంది హాజరయ్యారు. వారికి ఆయా మండలాల్లో గ్రామాలను కేటాయించి ఈవీఎం, పోలింగ్ సామగ్రిని ఆర్‌ఓ, ఆర్డీఓ సూర్యనారాయణ పర్యవేక్షణలో పంపిణీ చేశారు.

296 పోలింగ్ కేంద్రాలు

కోదాడ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 296 పోలింగ్ కేంద్రాలు ఉండగా 2,45,187 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించేందుకు 1500 మంది పోలింగ్ సిబ్బందిని, 700 మంది రాష్ట్ర పోలీసులు, కేంద్ర బలగాలను నియమించారు.

పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

బాలాజీనగర్‌లో గల ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్‌హెగ్డే పరిశీలించారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందికి వారు పలు సూచనలు చేశారు. అదే విధంగా పోలింగ్ సెంటర్‌లోకి ఇతరులను పంపించవద్దని, 100మీటర్ల వరకు ఆంక్షలు విధించాలన్నారు. అనంతరం పట్టణంలో ఏర్పాటు చేసిన యువ, మహిళ, దివ్యాంగుల ఆదర్శ పోలింగ్ కేంద్రాలను వారు సందర్శించారు.



కోదాడ : సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న పోలింగ్, పోలీస్ సిబ్బంది



కోదాడ : పోలింగ్ సామగ్రితో ఎన్నికల సిబ్బంది



నడిగూడెంలోని మోడల్ పోలింగ్ కేంద్రం

పోలింగ్ కేంద్రాల్లో నూరుశాతం వెబ్ కాస్టింగ్

- నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ శ్రీనివాస్ వెల్లడి



హుజూర్‌నగర్ : మాట్లాడుతున్న నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్

హుజూర్‌నగర్ : పోలింగ్ కేంద్రాల్లో నూరుశాతం వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ శ్రీనివాస్, అదనపు అసిసెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ నాగార్జున రెడ్డి తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 29 సెక్టార్లుగా విభజించి మొత్తం 308 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రానికి 4గురు అధికారులు చొప్పున 1,232 మంది సిబ్బందిని నియమించామన్నారు. 177 పోలింగ్ లొకేషన్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలో 39 గ్రామాల్లో 45 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి వాటిలో మైక్రో అబ్జర్వర్ల ద్వారా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 29 రూట్స్, 29 సెక్టార్ ఆఫీసర్స్, 29 రూటు ఆఫీసర్లు, 29 పోలీసు రూట్ ఆఫీసర్లను నియమించామని తెలిపారు. ప్రతి సెక్టార్‌కు 2 ఈవీఎంలను అదనంగా అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఈవీఎంలలో ఏమైనా సమస్యలు తలెత్తితే వాటిని బాగు చేసేందు ముగ్గురు సాంకేతిక నిపుణులను అందుబాటులో ఉంచామని చెప్పారు. అదే విధంగా ఐదు మహిళ పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యేకంగా దివ్యాంగుల పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల విధుల కోసం 308 ప్రిసైడింగ్ ఆఫీసర్లు 308 అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు 616 పోలింగ్ ఆఫీసర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదనంగా మరి కొంతమంది సిబ్బందిని రిజర్వులో ఉంచినట్లు వివరించారు.

నియోజకవర్గంలో 2,51,444 మంది ఓటర్లు

నియోజకవర్గంలో మొత్తం 2,51,444 మంది ఓటర్లు ఉండగా వారిలో 1,21,956 మంది పురుషులు ఉండగా 1,29,471 మంది మహిళలు కాగా ట్రాన్స్‌జెండర్లు 17 గురు ఉన్నారని తెలిపారు. వీరంతా సోమవారం జరిగే ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించు కోనున్నారని చెప్పారు. పోలింగ్ కేంద్రాంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు. ఓటర్లు నిర్భంయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు కోరారు. అనంతరం ఎన్నికల విధుల కేటాయించిన అధికారులకు ఈవీఎంలు, వీవీప్యాట్లు ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. దీంతో వారు తమకు కేటాయించిన వాహనాల్లో సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. సాయంత్రం కురిసిన వర్షానికి కొంత అంతరాయం కలిగింది.



హుజూర్‌నగర్: సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది



ఎన్నికల సామగ్రిని తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

678మంది సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు

- పోలీస్ నోడల్ అధికారి, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు



పోలీసులకు బ్రీఫింగ్ నిర్వహిస్తున్న అదనపు ఎస్పీ నాగేశ్వరరావు

హుజూర్‌నగర్ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో 678 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పోలీస్ నోడల్ అధికారి, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు. హుజూర్‌నగర్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్ర వద్ద ఆదివారం ఆయన పోలీస్ ఎన్నికల సిబ్బందికి బ్రీఫింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఏదైనా సమస్య తలెత్తినప్పుడు వెంటనే అక్కడ ఉన్న లోకల్ పోలీస్ అధికారులకు తెలియ జేయాలన్నారు. ఓటర్లు ప్రశాతంగా ఓటు వేసే విధంగా పోలీసులు చూడాలనిఅన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 29 రూట్లలో వెళ్లే వాహనాల వెంట ఒక్కొక్క రూటుకు ఒక హెడ్ కానిస్టేబ్‌తో పాటు నలుగురు పోలీస్ సిబ్బందిని నియమించామని తెలిపారు. ఒక్కొక్కరూటుకి 12 పోలింగ్ స్టేషన్లను వచ్చే విధంగా ఏర్పాటు చేశామని చెప్పారు. ఎన్నికలు ప్రక్రియను ఎప్పటి కప్పుడు పర్యవేక్షించేందుకు సైబర్ క్రైం డీఎస్పీ శ్రీనివాస్, సైబర్ క్రైం టీం లక్ష్మీనారాయణ, స్థానిక సీఐ చరమంద రాజులతోపాటు 7 మండలాల ఎస్‌ఐలు అదనంగా 6గురు అడిషనల్ ఎస్‌లతో క్విక్ రియాక్షన్ టీములను నియమించామనివివరించారు. నియోజకవర్గంలో 39 సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని అత్యధికంగా మఠంపల్లి, చింతలపాలెం మండలంలలోనే ఆ గ్రామాలు ఉన్నాయని తెలిపారు. అక్కడ స్థానిక పోలీసులతోపాటు ప్రత్యేక సాయుధ బలగాలను మోహరించినట్లు తెలిపారు. అంతే కాకుండా తమిళనాడు ఫోర్స్, అరుణాచల్ ప్రదేశ్ నుంచి వచ్చిన ఇండియన్ రిజర్వ్‌డ్ బెటాలియన్ (ఐఆర్‌బీఎన్), తెలంగాణ స్టేట్ స్పెషల్ ఫోర్స్, ట్రైనింగ్ కానిస్టేబుళ్లతో ఎన్నికల బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారని ఆయన వివరించారు. ఆయన వెంట సీఐ చరమందరాజు తదితరులు ఉన్నారు.



హుజూర్‌నగర్ : ఎన్నికల బందోబస్తుకు హాజరైన కేంద్ర బలగాలు

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

నడిగూడెం : మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం జరగనున్న పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నడిగూడెం ఎస్‌ఐ జి.అజయ్ కుమార్ తెలిపారు. 50 మంది పోలీసు సిబ్బందిలో 29 పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీరిలో స్థానిక పోలీసు సిబ్బందితో పాటు ఆర్మ్‌డ్ ఫోర్సు సిబ్బంది 46 మందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలైన నడిగూడెం, వేణుగోపాలపురం, సిరిపురం, వల్లాపురం, తెల్లబల్లిలో ప్రత్యేక బలగాలతో బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు.

హుజూర్‌నగర్‌లో భారీ వర్షం



హుజూర్‌నగర్‌లో కురుస్తున్న వర్షం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో ఈదురు గాలులు వీచాయి. దీనికి తోడు గాలి దుమారం చెలరేగడంతో వీధులు, వాకిళ్లు చెత్తతో నిండిపోయాయి. దాదాపు గంట పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో పలువురు ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉండగా ఇన్నాళ్లు ఎండలకు అల్లాడిన ప్రజలు ఈదురు గాలులకు తోడు వర్షం కురిసి వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ఒకింత సేదదీరారు. ఈదురు గాలులు బలంగా వీచడంతో ముందు జాగ్రత్త చర్యగా పట్టణంలో విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. వర్షం వెలిసిన అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం



నేరేడుచర్ల పోలింగ్ బూత్ వద్ద అధికారులు ఏర్పాటు చేసిన టెంటు



నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్

నేరేడుచర్ల : పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా నేరేడుచర్ల మండలంతో పాటు పట్టణంలో మొత్తం 17 గ్రామ పంచాయతీలు, 15 వార్డుల్లో 48 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో మొత్తం 35 వేల 818 మంది ఓటర్లు తమ ఓటు హక్కును నియోగించుకోనున్నారు.ఆయా కేంద్రాలకు 170 మంది సిబ్బందిని నియమించారు. వీరితో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం 75 మంది పోలీస్ సిబ్బందిని కేటాయించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో పీఓ, ఏపీఓ, ఓపీఓలు ఇద్దరు ఉంటారు. మండలంలోని మేడారం, పెంచికల్‌దిన్న, కల్లూరు గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. ఆయా గ్రామాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు సామగ్రిచేరింది. ఎన్నికల అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపారు.

పాలకవీడు: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. మండలంలోని 22 గ్రామాల్లో 27 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. మండల వ్యాప్తంగా 21,144 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఎన్నికల అధికారులు, సిబ్బంది తమతమ పోలింగ్ సామాగ్రితో ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటల నుండి సాయత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఓటర్లు తమ ఓటరు స్లిప్‌తో పాటు ఏదైనా ఫోటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన అమలులో ఉంటుందని ఎస్‌ఐ లక్ష్మీనర్సయ్య తెలిపారు.

మేళ్లచెరువు : లోక్‌సభ ఎన్నికలకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. మండలంలో 41 పోలింగ్ బూతులను ఏర్పాటు చేయగా అందులో మొత్తం 33,878 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలీంగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు.

గరిడేపల్లి : లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. గరిడేపల్లి గ్రామ పంచాయతీని ఆదర్శ పోలింగ్ కేంద్రంగా ప్రకటించడంతో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీఓ కన్మంతరెడ్డి వనజ ఆధ్వర్యంలో అధికారులు కేంద్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారు. ఈ కేంద్రంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. మట్టి కుండలను మంచినీటి కోసం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని తహశీల్దార్ కవిత, ఏపీఓ సురేష్, పంచాయతీ కార్యదర్శి సురేష్, వరుణ్ తదితరులు సందర్శించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.



మేళ్లచెరువు: పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది



పాలకవీడులో ఎన్నికల సిబ్బంది



గరిడేపల్లి : పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి



పూజలు చేస్తున్న పురోహితులు

గరిడేపల్లి : మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలో శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆదిశంకరాచార్యుల జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశేషంగా దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన బ్రహ్మణోత్తముల చేత ఆదిశంకరాచార్య వారి పూజా, భజన కార్యక్రమం విశేషంగా నిర్వహించారు. ఆదిశంకరాచార్య ఆరుద్ర నక్షత్రం అన్ని ఆకారాలు కలిసి రావటం చాలా విశేషమైనటువంటి రోజన్నారు. పూజా కార్యక్రమాలు రాయప్రోలు భద్రయ్య శర్మ, శ్రీ రామయ్య శర్మ, ఉదయ వెంకట శివ నాగదత్త హనుమ సత్య జయసాయి శర్మ తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు సీసీ రోడ్ల కళ



అర్వపల్లిలోని ఓ వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు



బొల్లంపల్లిలో ..

- 14 పంచాయతీలలో పూర్తయిన నిర్మాణాలు
- రూ.1.70 కోట్లతో పనులు

అర్వపల్లి : పల్లెల్లోని వీధుల్లో సీసీ రోడ్లను నిర్మించే పనులు పూర్తి కావస్తున్నాయి. దీంతో బురుదమయంగా, గుంతలమయంగా ఉన్న వీధుల సమస్యకు పరిష్కారం లభిస్తోంది. జాజిరెడ్డిగూడెం మండలంలోని గ్రామ పంచాయతీల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.1.70 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో మొత్తం సుమారు 6 కిలోమీటర్ల పొడవున వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా ఇప్పటికే 14 గ్రామ పంచాయతీల్లో 5 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. మిగిలిన 1 కిలోమీటర్ సీసీ రోడ్ల నిర్మాణ పనులు జరగాల్సి ఉంది. మండలంలోని కుంచమర్తి, ఉయ్యాలవాడ, సూర్యనాయక్‌తండాలలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ గ్రామాలలో పనులు జరిగితే మండల వ్యాప్తంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు దాదాపు పూర్తయినట్లే అవుతుంది.

ఇబ్బందులు తీరనున్నాయి



చిన్నపాటి వర్షం పడినా గ్రామాల్లో వీధులు చిత్తడిగా మారి ప్రజలు ఇబ్బందులు పడేవారు. ప్రభుత్వం రూ.1.70 కోట్లు మంజూరు చేసి అన్ని గ్రామాల్లో సీసీరోడ్లను నిర్మించడం సంతోషకరం. ఈ సీసీ రోడ్ల నిర్మాణంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తదు.

– సంగు జానయ్య, కోడూరు

మిగిలిన గ్రామాల్లోనూ చేయిస్తాం



జాజిరెడ్డిగూడెం మండలంలో 17 గ్రామ పంచాయతీకు గానూ ఇప్పటికే 14 గ్రామాల్లో పనులు పూర్తి చేయించాం. మిగిలిన 3 గ్రామ పంచాయతీలలో పనులు జరిపిస్తాం. మండల వ్యాప్తంగా సుమారు 5 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాం.

– అశోక్, పీఆర్ ఏఈ

చెరువు శిఖం భూములు ఆక్రమణ !

- మట్టి పోసి చదును చేసుకుంటున్న అక్రమార్కులు
- యథేచ్ఛగా చెరువుల్లోని ఒండ్రు మట్టి తరలింపు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు కబ్జాకు గురవుతున్నాయి. వేసవి కాలం నీరు అడుగంటడంతో అక్రమార్కులు చెరువు శిఖం భూములను చదును చేసుకుని ఆక్రమించేస్తున్నారు. విషయం తెలిసినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. హుజూర్‌నగర్ రూరల్ మండలంలోని మాచవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 81, 82లలో 20ఎకరాల్లో నల్లచెరువు, సర్వే నంబర్ 196లో 35 ఎకరాల్లో లింగకుంట చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల శిఖం భూమి కబ్జాకు గురైందని ఆయా గ్రామాల ప్రజల పేర్కొంటున్నారు. రాత్రి సమయంలో జేసీబీలు, ట్రాక్టర్లతో చెరువులోని మట్టి శిఖం భూమిలో పోసి సుమారు 5ఎకరాలకు పైగా కబ్జా చేసినట్లు పరిసర ప్రాంత రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై సమాచారం ఇచ్చినా ఇరిగేషన్, రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



మాచవరంలోని నల్లచెరువులో జేసీబీతో మట్టిని ఎత్తిస్తున్న దళారులు

ట్రాక్టర్ మట్టికి రూ.700.. టిప్పర్ మట్టికి రూ.వెయ్యి..

మండలంలోని చెరువులు, కుంటలు, గుట్టలు అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. మట్టికి బాగా డిమాండ్ పెరగడంతో కొందరు అనుమతులు లేకుండా చెరువు మట్టిని ఇటుక బట్టీలు, వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ మాచవరం, గోపాలపురం తదితర గ్రామాల్లో నిత్యం పదుల సంఖ్యలో చెరువులు, కుంటల నుంచి టిప్పర్లు, ట్రాక్టర్లు ద్వారా మట్టిని తరలిస్తున్నారు. కొందరు నాయకులు చెరువులు, కుంటల్లోని ఒండ్రుమట్టిని జేసీబీల ద్వారా తవ్వి ఇటుక బట్టీలకు, కొందరు వ్యాపారస్తులకు ట్రాక్టర్ మట్టి రూ.700, టిప్పర్ మట్టి రూ.1000 వరకు అమ్ముకుంటున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.



గోపాలపురం పెద్ద చెరువులో పెట్టిన గుంతలు

చర్యలు తీసుకుంటాం

బూరుగడ్డ మాచవరం, గోపాలపురం చెరువుల నుంచి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారని, మాచవరం నల్లచెరువుతో పాటు కరక్కాయలగూడెం శివారుల్లో ఉన్న ప్రభుత్వ భూముల్లో కొందరు మట్టిపోసి కబ్జాకు పాల్పడుతున్నారన్న విషయం నా దృష్టికి వచ్చింది. కబ్జాకు పాల్పడిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు ఉన్నాధికారులకు సమాచారం ఇచ్చా. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– తుమ్మల శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఈ, హుజూర్‌నగర్